


వరహాల రాజు ఆ యొక్క- భద్రగిరి దరి చేరే వరకు ఒక విచిత్రమైన సన్నివేశం దృగ్గోచరమైంది.

ఒక కారు, గేటు ఇవతల హఠాత్తుగా బైఠాయింపు సమ్మె చేసినట్లు ఆగిపోయింది. బహుశా డ్రైవరుకి జీతం అందలేదు కాబోలు, అందుకని ఇది సింపతటిక్ లేక సానుభూతి సమ్మె అని చూపరి దురభిప్రాయ పడవచ్చు. కాని అది సత్యదూరం. దాదాపు ఆమడ దూరము. సత్యం చాలా మంచివాడు—సత్యం అంటే ఆ కారులో ప్రొడ్యూసరు. మంచివాడు.

జీతాలు బకాయి పెట్టడు. అయితే కారు ఆగిన కారణం యేమిటి? ఇందాక దురభిప్రాయపడిన చూపరి ఇంకో క్షణం ఆగిచూస్తే, స్వామి భక్తి వల్లనే అని చటుక్కున గ్రహించేసేవాడు.

ఎందుకంటే ఆ స్వామి ఆనందంతో ఉబ్బి లావుగా అయిపోయాడు. కారుకూడా ఆ ఆనందంకాస్త పుచ్చుకుని బరువెక్కి ఉక్కిరి బిక్కిరై ఆగిపోయింది. సరే అందుకని అందులోని లావుపాటి సత్యం ఇంక ఉండబట్టలేక ఇవతలకి ఊడిపోయాడు. ఆపైన, ఆనందంతో, వినాయకచవితిలో బొడ్డపాటి కృష్ణారావులా మనోహరంగా విలాసంగా చిందులు తొక్కుతూ అలా కాలినడకనే స్టుడియోలోకి వెళ్ళిపోతున్నాడు. గేటు దాటుతూ ఉండగా ఎదురుగా ఇంకోకారు వచ్చింది.

అందులో ఆయన ఈ ఆనంద నృత్యం చూసి ఏమిటి గిరాకి అన్నాడు.

'కుడుతుటాంగో బా .... కుడుతుటాంగ, రెండుపేరుం ఒరే అడి కాల్‌షీట్ కుడుతుటాంగ. ఇది ముడింజిదన్నా వేరెన్నదా వోణుం....అడ మురుహా. ఎణ్ణాచ్చొల్లర్రిదణ్ణే. అంద పయలెకిటె బీడీవాంగిపుడిచేంబార్ ........అవ్వొళవ్వ త్తాఁ.... ఒరే అడ్డియా రెండు పేరుం, 'సర్దాసార్ ఇన్నికి పూరావుం నంబసెట్‌టెత్తాన్ వేలెపణ్ణువోఁ .... అదుకెణ్ణె ...., అడ్డీనుటాంగ.... అడః యన్నాల నంబవే ముడీలెణ్ణాకా....కణ్ణే యారుకుం చొల్లాదె....మనదిలె వెచ్చికొ .... అంద గోంఖురా పయ్యనాలెత్తాన్ ఇవ్వొళవు అదిష్టం," అంటూ ఉభయభాషా ప్రవీణ లావుపాటి సత్యం ఉహూ మురిసి పోతూ పల్లవికి ముక్తాయింపు డాన్సు పూర్తిచేసి రెండో చరణం ఆరంభిస్తూ, అలా అలా తోకలేక తూకం చెడ్డ గాలిపడగలా పల్టీలు కొట్టబోయి తమాయించుకుంటూ, 'తెర వేలుపుల విహారసీమయగు చలనచిత్ర స్వర్గసీమలోకి, సాఫీగా ఫేడౌటు అయిపోయాడు.

కారులో కూర్చున్న రెండో ఆయన తక్షణం కారుదిగి, గేటుదగ్గర

నిల్చున్న ఒక నవయువకుడిని ఆప్యాయంగా పలకరించి ఆ బీడీ నాకిచ్చేద్దూ బాబ్బాబూ అన్నాడు.

ముట్టించబోతున్న బీడీ ఆపళంగా తీసేసి దిక్కుమొహం పెట్టి ఒక్కసారి నాకి ఇచ్చేశాడు ఆ యువకుడు.

ఉత్త్వ సంధిచేసి మాట్లాడినందుకు స్వగతంలో చెంపలేసుకుని, ప్రకాశంగా నోరు మూసుకొని కారులో దూరి తుర్రుమన్నాడు ఆ పెద్ద మనిషి.

బీడీ యిచ్చిన యువకుడు ఉస్సురని నిట్టూర్చి గోడకు జేరగిల బడ్డాడు.

* * * *

ఈ దృశ్యం చూచిన వరహాలరాజు విస్మయచకితుడై పోయి, దగ్గరసావెళ్ళి 'సార్' అన్నాడు.

"ఇంక లేవండి" అన్నాడు ఆ యువకుడు.

"అదికాదు సార్" అన్నాడు రాజు.

"రూపాయలు అసలే లేవండి. బీడీలే అయిపోత" అన్నాడు ఆ యువకుడు విసుగ్గా.

"అదీకాదు సార్. ఇందాకా ఆ లావుపాటి ఆయన ఎందుకు దాన్సు చేశాడు? ఈ కారువాడితో ఆయన చెప్పిందేమిటి? ఈయనకి ఇంత పెద్దకారూ బోల్డు డబ్బూ ఉంది గదా మిమ్మల్నిలా పీడించి బీడీ లాక్కోవడం ఎందుచేత? ఇదంతా పెద్ద మిష్టరీగా ఉంది. విచ్చగొట్టరూ?" అన్నాడు.

ఆ యువకుడు రాజువంక తేరిపార చూశాడు. "మీరు ప్రొడ్యూసరు కాదు కదా? అయినా నన్నేం అడగరు గదా?.... జేబులో ఒకటే బటాణీఉంది.

కాస్సేపుండి మధ్యాహ్నం లంచిగా తిందామనుకున్నాను. అది ఇవ్వమనరు గదా?" అన్నాడు.

"నేను ప్రొడ్యూసర్ని కాదండి. హీరో అవుదామను కుంటున్నాను ఇప్పటికి నా పేరు రాజా" అన్నాడురాజు.

"నా పేరు బాబు, నాది పెద్దకథ, కదిలిస్తే కథ చెప్పేడు చూశావా లోకువకట్టి అని తిట్టుకోనంటే నా కథ చెబుతా. అది వింటే మీ మిష్టరీ విచ్చిపోతుంది. బై దిబై మీరు డిటెక్టివ్ నవల్సు రాసేవాళ్లు కాదుగదా?"

"కాను." అని ఒట్టుపెట్టి అరచేయి గిల్లాడు రాజు.

"అయితే పదండి నా కథ చెబుతా. ఇక్కడికి దగ్గరలోనే టీ కొట్టులో కూర్చుందాం. టీ తాగక్కర్లేదు లెండి. ఊరికే కూర్చోనిస్తాడు. నేను కూర్చుంటే చాలు వాడికి రోజుకి లక్షరూపాయల వ్యాపారం జరుగు తుంది" అన్నాడు బాబు.

'ఆః అలాగా' అని ఆశ్చర్యపడబోయాడు రాజు.

బాబు అతన్ని గబుక్కున పట్టుకున్నాడు పడకుండా. "అలాటి పిచ్చి పనులు చేస్తే చెప్పను" అంటూ.

ఇద్దరూ కొంతదూరం వెళ్ళి స్తిమితంగా టీ కొట్టులో కూర్చున్నాక, రాజే వద్దన్నా వినకుండా రెండు అరలు తెమ్మన్నాడు.